# అస్మదీయులు - తస్మదీయులు

మాధవరావు మధుసూదన్ ఇంటికి చుట్టపుచూపుగా వచ్చాడు. బంధుత్వమే కాకుండా వాళ్ళు మంచి స్నేహితులు కూడా. మాధవరావును చూడగానే మధుసూదన్ చాలా హుషారుగా మారిపోయాడు.

"ఎన్నాళ్ళకెన్నాళ్ళకు కనిపించావురా మాధవ్... ఈమధ్య నువ్వు నాకెన్నిసార్లు గుర్తొచ్చావో..." అన్నాడు మధుసూదన్.

"నువ్వు, మీ ఆవిడా అమెరికాకెళ్ళారుగా... ఎప్పుడొచ్చారు?" అన్నాడు మాధవరావు మధుసూదన్ పక్కనే ఉన్న సోఫాలో కూర్చుంటూ.

"మేమొచ్చి రెండు నెలలయ్యింది. నీకెన్నిసార్లు ఫోన్ చేసినా నెంబర్ బిజీ అనో, స్విఛాఫ్ అనో వస్తోంది..." అన్నాడు మధుసూదన్.

"అబద్ధం లేరా... నువ్వు నాకెప్పుడు ఫోన్ చేశావు... నీకంత తీరికెక్కడుంటుంది. పోనీయ్‌లే గానీ మీ అమెరికా టూర్ గురించి చెప్పు... యేమేం చూశారు... ఎక్కడెక్కడికెళ్ళారు?"

"ఎన్ననిచెప్పమంటావు... ఎంతసేపని చెప్పమంటావు... అదొక అద్భుత ప్రపంచం మాధవ్... భూతల స్వర్గమనుకో... మేమక్కడ ఆరునెలలున్నాం... ఆరునెలలు ఆరుక్షణాల్లా గడిచాయనుకో..."

"నిజంగానా? అమెరికాకెళ్ళొచ్చిన కొందరు ఎక్కడికీ వెళ్ళకుండా ఇంట్లోనే ఖైదీల్లా ఉండిపోయాం... బోరై చచ్చాం అని చెప్పగా విన్నాను..."

"ఎక్కడికీ వెళ్ళకుండా యేదీ చూడకుండా వచ్చేసినవాళ్ళు అలాగే చెబుతారు... కానీ మాకలాంటి పరిస్థితి ఎదురుకాలేదు. అక్కడున్న మా అమ్మాయి, అల్లుడు మమ్మల్నెంత బాగా చూసుకున్నారో... ఎన్నెన్ని అద్భుతమైన ప్రదేశాలకు తీసికెళ్ళారో... నేనూ, మా ఆవిడ ఎంత ఎన్‌జాయ్ చేశామో... అదో గొప్ప అనుభవం... ఈ జన్మకిది చాలు అన్నంతగా ఎన్‌జాయ్ చేశాం..."

"అబ్బా! అంతగా ఎన్‌జాయ్ చేశారా? ఆ ఎన్‌జాయ్‌మెంట్‌లో నన్ను కూడా కొంచెం పాలుపంచుకోనీయ్..."

"తప్పకుండారా... మేం చూసిన ప్లేసెస్‌లో ఎన్ని ఫోటోలు దిగామో, ఎన్ని దృశ్యాల్ని వీడియో కెమెరాలో బంధించామో... నీకు ఓపికుంటే అవన్నీ నీకు చూపిస్తా..."

"అవన్నీ తర్వాత చూద్దాంగానీ మొదలైతే యేమేం చూశారో, ఎక్కడెక్కడికెళ్ళారో చెబుదువూ?"

"మా అమ్మాయి, అల్లుడు బోస్టన్‌లో ఉంటారని నీకు తెలుసుగా... దాన్ని బోస్టన్ అనొద్దుట... బాస్టన్ అనాలట... మేమైతే బోస్టన్ అనే అన్నామనుకో... మేం బోస్టన్ అన్నప్పుడల్లా మా అల్లుడు బోస్టన్ కాదు మామయ్యా! బాస్టన్ అనాలని చెబుతుండేవాడు..." అంటూనే మధుసూదన్ పెద్దగా నవ్వాడు.

"ఇక్కడందరూ బోస్టన్ అనే అంటారులే..." అన్నాడు మాధవరావు.

"అది పోనీయ్‌లేరా... మేం స్టార్టయినప్పట్నించి చెబుతా విను... మాకు వాళ్ళు బ్రిటిష్ ఎయిర్‌వేస్‌లో టికెట్స్ బుక్‌చేసి ఇంటర్నెట్ ద్వారా టికెట్స్ పంపించారు. బ్రిటిష్ ఎయిర్‌వేస్ అంటే యేమిటనుకున్నావు... అవి విమానాలు కావు... స్వర్గలోకాలు... ఆ విమానాలు మన డొక్కు ఎయిర్ ఇండియా విమానాల్లా ఉంటాయనుకున్నావా? అద్భుతం... మహాద్భుతంగా ఉంటాయి... ఆ సీట్లు... ఆ వాతావరణం... ఆ ఎయిర్‌హోస్టెస్సులు... వాళ్ళు సప్లై చేసే స్నాక్స్, డ్రింక్స్, ఫుడ్... అన్నీ హైక్లాసే... ఆ విమానంలోకి అడుగుపెట్టగానే మయసభలోకి అడుగుపెట్టినట్టుగా ఫీలయ్యాం... విమానం ఒక్క లండన్‌లో రెండుగంటలాగింది.... అక్కడ్నించి బోస్టన్... మొత్తం 16 గంటల ప్రయాణం... బోస్టన్‌లో దిగగానే మా అమ్మాయి, మా అల్లుడు ఎయిర్‌పోర్టుకొచ్చి లగ్గేజి కౌంటర్ దగ్గర మమ్మల్ని రిసీవ్ చేసుకున్నారు. ఎయిర్‌పోర్టుకు వాళ్ళుంటున్న ఇల్లు 20 మైళ్ళ దూరం ఉంటుంది. అమెరికాలో అందరూ మైళ్ళనే అంటారు... కిలోమీటర్లు అనరు... మా అల్లుడి కార్లో అరగంటలో మేం మా అమ్మాయివాళ్ళుంటున్న ఇల్లు చేరుకున్నాం, అమెరికాలో రోడ్లు ఫోర్ ఫోర్ లేన్స్. ఎంత బావుంటాయనకున్నావు... ఒకసారి ఎన్.టి. రామారావు అమెరికాకెళ్ళొచ్చి యేమన్నాడో గుర్తుందా? వాళ్ళ రోడ్లు మన బెడ్‌రూమ్స్ కంటే బావుంటాయన్నాడు. ఆ రోడ్లమీద కార్లో ప్రయాణం చేస్తోంటే ఎంత హాయిగా ఉంటుందో నువ్వూహించుకోలేవు... ఇక మా వాళ్ళుంటున్న ఇల్లు గురించి యేం చెప్పమంటావు... అదో ప్యాలస్ అనుకో... ఇంటిముందు, ఇంటివెనకా మంచి గార్డెన్... పచ్చటి లాన్... అక్కడ ప్రతి ఇంటిముందు లాన్ తప్పనిసరిగా ఉండాలట... అమెరికాలో ఎక్కడ చూసినా పచ్చటి చెట్లు... పచ్చటి లాన్స్... వాళ్ళింటి చుట్టూ రకరకాల పూలచెట్లతో నిండిన గార్డెన్. నందనవనంలా ఉంటుందక్కడి వాతావరణం. ఇంట్లోకెళ్ళగానే ఎంత హాయిగా ఫీలయ్యామో... ఆ విశాలమైన రూమ్స్... ఆ కార్పెట్స్...

ఆ ఎల్.సీ.డి స్క్రీన్స్... ఆ రెస్ట్‌రూమ్స్... ఆ లైట్స్... ఆ కిచెన్... ఆ కిచెన్‌లో ఉన్న గాడ్జెట్స్... ఎవ్రీథింగ్ ఈజ్ గ్రేట్... మా అల్లుడక్కడ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు... మా అమ్మాయి అనిత వెళ్ళిన కొత్తలో యేదో చిన్న జాబ్ చేసిందిగానీ కొడుకు పుట్టాక మానేసింది... ఇద్దరికీ హాయిగా బతకడానికి కావలసినంత డబ్బు – సుజిత్, అంటే మా అల్లుడు సంపాదిస్తున్నాడు... వాళ్ళకు చెరో కారు... అల్లుడు ఆఫీసుకు వెళ్ళినప్పుడు మా అమ్మాయే మమ్మల్ని కార్లో తిప్పుతుండేది. బోస్టన్ అమెరికాలో ఉన్న మోస్ట్ బ్యూటిఫుల్ సిటీస్‌లో ఒకటి... బోస్టన్ సిటీ పక్కనే అట్లాంటిక్ సముద్రం ఉంటుంది. ఆ సముద్రాన్ని చూడటం, బోట్‌లో ఆ సముద్రం మీద విహరించటం... "బోస్టన్ టీపార్టీ" జరిగిన ప్లేస్ చూడటం... అమెరికన్ రెవల్యూషన్ టైమ్‌లో ఇంగ్లాండ్ నుండొచ్చిన టీ బండిల్స్‌ని షిప్స్‌లో పనిచేసే అమెరికన్ శ్రామికులు సముద్రంలో ముంచేసిన సంఘటనని "బోస్టన్ టీపార్టీ" అంటారు. అమెరికాను కొంతకాలం బ్రిటిష్‌వాళ్ళు పరిపాలించారని, వాళ్ళకు వ్యతిరేకంగా అమెరికన్స్ పోరాడి వాళ్ళను ఇంగ్లాండ్‌కు పంపించేశారని, ఈ సంఘటనని చరిత్రలో అమెరికన్ రెవల్యూషన్ అంటారని నువ్వు చదివే ఉంటావు..."

"చదివే ఉంటాను... కానీ అవన్నీ నాకెక్కడ గుర్తున్నాయిలే..."

"బోస్టన్‌లో ఎం.ఐ.టీ. అని గొప్ప ఇన్‌స్టిట్యూషన్... మసాఛిచెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ... అని ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన యూనివర్శిటీ.. అక్కడ గొప్పగొప్ప పరిశోధనలు జరిగాయి... అక్కడ పనిచేసిన ఎందరికో నోబెల్ ప్రైజెస్ వచ్చాయి... ఆ ఎం.ఐ.టీ.ని చూశాం... ఇంకా అక్కడి మ్యూజియమ్స్‌ని, పార్కుల్ని, షాపింగ్‌మాల్స్‌ని చూశాం... అక్కడ్నించి మా అమ్మాయి, అల్లుడు మమ్మల్ని కార్లో న్యూయార్క్ తీసికెళ్ళారు... న్యూయార్క్ అంటే నీకు తెలుసుగా.. ఇట్స్ ఎ సిటీ ఆఫ్ స్కైస్క్రాపర్స్... ఆ ఆకాశహర్మ్యాల్ని చూస్తోంటే మతిపోతుందనుకో... ఆకాశాన్ని అంటినట్టుగా కనిపించే ఆ బిల్డింగ్స్ ఎలా నిర్మించారో ఊహించలేం... రెండుమూడు రోజులు న్యూయార్కంతా తిరిగాం... యూ.ఎన్.వో. బిల్డింగ్, మొన్న కూల్చివేయబడిన డబ్ల్యూటివో టవర్స్ చూశాం. ఒకరోజు పెద్ద బోట్ మీద స్టాట్యూ ఆఫ్ లిబర్టీ చూడటానికెళ్ళాం... మోస్ట్ మెమొరబుల్ ట్రిప్... అదో అద్భుత నిర్మాణం... ఫ్రాన్స్‌లో తయారైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు సింబలైన ఆ విగ్రహాన్ని ఇక్కడ న్యూయార్క్‌లో మ్యాన్‌హట్టన్ ద్వీపం మీద ప్రతిష్ఠించారు... చుట్టూ సముద్రం... అసలు న్యూయార్క్ సిటీ యేమిటనుకున్నావు? ఎన్నో చిన్నచిన్న ద్వీపాల మీద ఆ బ్రహ్మాండమైన సిటీని

నిర్మించారు.... న్యూయార్క్‌లో ఉన్న ఆ మూడురోజులు మేమో ఫైవ్‌స్టార్ హోటళ్ళో ఉన్నాం... న్యూయార్క్ నుండి మేం న్యూజెర్సీ వెళ్ళాం... అదీ ఓ అద్భుత ప్రపంచమే... న్యూజెర్సీలో మా బంధువులున్నారు. వాళ్ళింట్లోనే ఉన్నాం. న్యూజెర్సీ నుండి న్యూయార్క్ వచ్చి కార్లో నయాగరా వెళ్ళాం. నయాగరా చూడటం ఒక థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్... జన్మలో మరచిపోలేం. అంత అద్భుతమైన జలపాతం ప్రపంచంలో మరెక్కడా లేదనుకుంటాను... నయాగరా జలపాతం రెండుచోట్ల ఉంటుంది... ఒకటి అమెరికా వైపుంటుంది. రెండోది కెనడా వైపుంటుంది... నయాగరా జలపాతమే కెనడాకు, అమెరికాకు మధ్య సరిహద్దు... నయాగరా నదికి అవతలివైపు కెనడాకు చెందిన టొరాంటో నగరం కనిపిస్తుంటుంది. నయాగరా జలపాతాల్ని చూస్తోంటే మనకళ్ళు చెదిరిపోతాయనుకో... ఎగిసిపడ్తున్న ఆ ప్రవాహపు ఉధృతి... ఆ హోరు... తెల్లటి మేఘంలా కనిపించేఆ తుంపర... ఆ తుంపరమీద సూర్యకిరణాలు పడ్డప్పుడు యేర్పడే ఇంద్రధనుస్సులు... "విండాఫ్ కేవ్స్" అని, "మొయిడాఫ్ మిస్ట్" అని... ఈ రెండు చోట్లకు మనల్ని తీసికెళ్ళి ఆ జలపాతాల్ని చాలా దగ్గర్నుంచి చూపెడ్తారు... ఎంత దగ్గరగా అంటే ఆ జలపాతం వచ్చి మనమీద పడ్తున్నట్టే మనం ఫీలవుతాం... ఆ జలపాతం నుండొస్తున్న తుంపరంతా మనమీద పడ్తుంది... మనం తడిచిపోకుండా ఉండటానికి నైలాన్‌కవర్స్ ఇస్తారు... జారిపడకుండా ఉండటానికి స్పెషల్ చెప్పుల్స్ వేసుకోమంటారు.. "మొయిడాఫ్ మిస్ట్"లో మనల్ని కెనడావైపున్న జలపాతం దగ్గరకు తీసికెడ్తారు... ఆ జలపాతం కిందకేవెళ్ళి మొత్తం తడిచి ముద్దయిపోతాం... నయాగరా జలపాతాన్ని రాత్రిపూట చూడటం... అదో అద్భుతమైన అనుభవం... రాత్రిపూట రంగురంగుల ఎలక్ట్రిక్ దీపాల్ని ఆ జలపాతం చుట్టూ వెలిగించి ఆ జలపాతాన్ని టెక్నికలర్లో చూపిస్తారు. ఆ దృశ్యాలను చూస్తోంటే ప్రపంచంలో ఇంత సౌందర్యం ఉందా అనిపిస్తుంది" అన్నాడు మధుసూదన్.

"వరేయ్ మధు... నువ్వు చెప్పింది వింటోంటే ఇప్పుడే వెళ్ళిపోయి ఆ నయాగరా ఫాల్స్‌ని చూడాలనిపిస్తోందిరా..." అన్నాడు మాధవరావు.

"చూడాలిరా... నువ్వెలాగైనా చూసిరావాలిరా" అన్నాడు మధుసూదన్.

"నాకెలా వీలవుతుందిరా మధూ! నీకంటె నిన్ను పువ్వుల్లోపెట్టి పూజించే కూతురు, అల్లుడు అక్కడున్నారు... నాకెవరున్నారు? అది సర్లే... ఎవరి అదృష్టం వారిది. ఇంకా యేమేం చూశారో చెప్పు..."

ఈలోగా మధుసూదన్ భార్య శారద వాళ్ళకు టీలు తెచ్చింది. ఇద్దరూ టీ సిప్‌చేస్తూ మాట్లాడుకోసాగారు.

"ఇంకా వాషింగ్టన్‌కెళ్ళాం... ప్రెసిడెంట్‌గారుండే వైట్‌హౌస్ చూశాం.... అంతేరా... ఇవన్నీ చూడటానికే మాకు రెన్నెళ్ళు పట్టింది..."

"లాస్‌వేగాస్, సాన్‌ఫ్రాన్సిస్కో, లాస్‌ఏంజెల్స్... ఇవి చూళ్ళేదా?"

"అవి అమెరికాకు పడమటివైపుంటాయి... మేం తూర్పు వైపున్న సిటీసే చూశాం.... పడమటి వైపు వెళ్ళలేదు"

"అమెరికాలో బాగా చలి ఉంటుందంటారుకదా..."

"నిజమే... మేం వెళ్ళింది ఫిబ్రవరిలో... మార్చ్ నుండి అమెరికాలో వేసవికాలం మొదలౌతుంది. చలుండదు... ఏప్రిల్, మే, జూన్, జూలై, ఆగస్టు – ఈ నెలల్లో అమెరికాలో చలి ఉండదు. మన ఇండియాలో ఉన్నట్టే ఉంటుంది. నవంబర్, డిసెంబర్, జనవరి నెలల్లో విపరీతమైన చలుంటుందట... మేమా చలికాలం రాకముందే అంటే జూన్‌లో ఇండియా కొచ్చేశాం... అమెరికాకు ఎప్పుడు రావాలి... ఎప్పుడు మళ్ళీ ఇండియా వెళ్ళాలి... యేయే సిటీస్ చూడాలి, ఇవన్నీ మా అమ్మాయే ప్లాన్ చేసింది... మేం అమెరికాలో ఉన్నన్ని రోజులు మా అమ్మాయి, మా అల్లుడు మమ్మల్నెంత ప్రేమగా చూసుకున్నారో చెప్పలేను... ఒక్కక్షణం కూడా మమ్మల్ని వదిలిపెట్టకుండా అనుక్షణం మాకేం కావాలో తెలుసుకుంటూ మాతోటే ఉండిపోయారనుకో..."

"మీ అల్లుడు ఉద్యోగం చేస్తున్నాడు కదా... ఆయనెలా మీతో ఉండిపోయాడు? ఈ ఆర్నెల్లు లీవ్ పెట్టేసేడా?"

"అమెరికాలో ఆరునెల్లు లీవ్‌పెడ్తే ఇంకేమన్నా ఉందా? మేం బయటకు వెళ్ళినప్పుడు మాత్రమే లీవ్ పెట్టేవాడు... అక్కడ ఉద్యోగం చేస్తున్నవాళ్ళకున్న ఒక సౌకర్యమేమిటో తెలుసా? ఇంట్లోనే ఉండి కంప్యూటర్ ద్వారా వాళ్ళు ఆఫీసులో చెయ్యాల్సిన పనుల్ని చేసేస్తారు... మా అల్లుడు చాలాసార్లు ఇంట్లోనే ఉండి ఆఫీసు పని చేసుకునేవాడు... వేరే సిటీకి వెళ్ళాల్సి వచ్చినప్పుడు మాత్రమే లీవ్ పెట్టేవాడు... ఎప్పుడన్న లీవ్ పెట్టడానికి వీలుకాదంటే మా అమ్మాయి "ఈ ఒక్కసారికి పెట్టండి... యేంకాదు. మా అమ్మానాన్నలు అంతదూరం నుండొచ్చారుకదా... వాళ్ళు మళ్ళీమళ్ళీ రాలేరా... వాళ్ళకోసం మనం ఈమాత్రం చెయ్యకపోతే ఎలా? అని అంటుండేది... మా అల్లుడు మా అమ్మాయి మాట జవదాటడు తెలుసా? మరో విషయం... మా అనిత వాళ్ళమ్మను ఎంత ప్రేమగా చూసుకుందనుకున్నావు... యేదన్నా పనిచేస్తానంటే వద్దనేది. శారదకు 24 గంటలు మా మనవడితోటే గడిచిపోయింది. మేం ఇండియాకు

బయల్దేరుతుంటే మా మనవడు వాళ్ళ అమ్మమ్మను గట్టిగా కౌగలించుకొని నువ్వు వెళ్ళొద్దని గంటసేపటి వరకు వదల్లేదు...” అన్నాడు మధుసూదన్.

“అవునూ... మీరెళ్ళొచ్చాక మీ వియ్యంకుడు, వియ్యంకురాలు కూడా అమెరికాకు వెళ్ళొచ్చారని తెలిసింది. అమెరికాలో వాళ్ళకెలా గడిచిందో?” అడిగాడు మాధవరావు.

“అవునట... మేం వెళ్ళొచ్చాక వాళ్ళు కూడా వెళ్ళారట... వాళ్ళకూ బాగానే గడిచి ఉంటుంది...” అన్నాడు మధుసూదన్.

“బాగా గడిస్తే ఆరునెల్లు ఉండొద్దామని వెళ్ళినవాళ్ళు రెండు నెలల్లోనే తిరిగొస్తారా?” అన్నాడు మాధవరావు.

“తిరిగొచ్చారా? మాకు తెలియనే తెలియదే... మా అనిత నిన్ననే ఫోన్ చేసింది. వాళ్ళు తిరిగొచ్చారని చెప్పనే లేదు... అసలు వాళ్ళ ప్రసక్తే తీసుకురాలేదు. చాలా ఆశ్చర్యంగా ఉందే!”

“మీ వియ్యంకుడు కూడా తిరిగొచ్చామని మీకు చెప్పలేదా? వాళ్ళొచ్చి వారం రోజులయ్యిందట...”

“చెప్పలేదు... వాళ్ళు మాకు ఎక్కువగా ఫోన్లు చెయ్యరులేరా... ఎప్పుడన్న చేస్తే మేమే చెయ్యాలి... అబ్బాయి తరఫువాళ్ళమని వాళ్ళకు బాగా ఫోజు... మేం వాళ్ళకంటె తక్కువవాళ్ళమని కూడా వాళ్ళ అభిప్రాయం...” అన్నాడు మధుసూదన్.

“మీ వియ్యంకుడు పురుషోత్తమరావు గారు నాకు బాగా తెలుసురా... నాకాయన బాబాయి అవుతాడు. ఆయన అలాంటి వాడు కాదు... హీ ఈజ్ ఎ జెంటిల్‌మెన్... అని అందరూ ఆయన గురించి చెబుతారు”

“పైకందరూ జెంటిల్‌మెన్‌లాగే కనిపిస్తార్లేరా...”

“పోనీయ్‌లేరా మధూ... ఎవరి అభిప్రాయాలు వారివి... నేవెళ్తామరి...”

“అప్పుడే వెళ్తావా? ఆ ఫోటోలు, ఆ సీడీలు చూడకుండానే వెళ్తావా? మా అల్లుడు తీసిన వీడియోలో నయాగరా ఫాల్స్ చూపిస్తా నీకు... లంచ్ చేస్తూ చూద్దాం...”

“మరోసారెప్పుడైనా చూస్తాలేరా... మా ఆవిడ నన్ను కూరగాయలు తెమ్మని పంపించింది. నాకేమో నిన్ను చూడాలనిపించి నీదగ్గరకొచ్చి ఇక్కడే ఆగిపోయాను... ఇంటికెళ్ళాక ఆవిడగారు ఎంత గొడవ చేస్తుందో యేమో...” అంటూనే మాధవరావు లేచి నిల్చున్నాడు.

“మరోసారెప్పుడైనా తప్పకుండా రావాలి... అవన్నీ చూడాలి...”

"అలాగేలేరా..." అంటూ మాధవరావు వాళ్ళింటి బయట పార్క్ చేసి ఉన్న తన మోటారుసైకిల్ స్టార్ట్ చేశాడు.

* * * *

ఐదారు రోజుల తర్వాత మాధవరావు పురుషోత్తమరావు వాళ్ళింటికి వెళ్ళాడు. పురుషోత్తమరావుతో మాధవరావుకు కొంచెం దూరపు బంధుత్వం ఉంది. పురుషోత్తమరావును మాధవరావు 'బాబాయి' అని పిలుస్తుంటాడు. అమెరికాలో వీళ్ళకెలా గడిచిందో తెలుసుకుందామన్న ఉత్సుకతతో మాధవరావు పురుషోత్తమరావింటికొచ్చాడు.

"యేంరా మాధవ్... బావున్నావా? నిన్ను చూసి చాలారోజులైంది..." అన్నాడు పురుషోత్తం.

"అవును బాబాయి... మీరు మొన్ననే అమెరికా వెళ్ళొచ్చారట... మీరు వెళ్ళేటప్పుడు ఆరునెల్లుంటామని వెళ్ళారు కదా... ఇంత త్వరగా వచ్చేశారేమిటి?" అన్నాడు మాధవరావు పురుషోత్తమరావు వాళ్ళ లివింగ్‌రూంలో ఉన్న సోఫాలో కూర్చుంటూ.

"రాక యేం చెయ్యమంటావురా... ఆ రెండు నెల్లు కూడా ఎందుకుండిపోయామా అని బాధపడ్తున్నాం... అసలు వెళ్లిన మర్నాడే రావాల్సిందని ఇప్పుడనుకుంటున్నాను"

"అదేమిటి బాబాయి. అమెరికా అంటే భూతలస్వర్గమని, ఆరునెల్లు ఆరు క్షణాల్లా గడిచాయని మీ వియ్యంకుడు మధుసూదన్ చెప్పాడు..."

"చెబుతాడు... ఎందుకు చెప్పడూ? అక్కడ వాళ్ళ కూతురుంది కదా..."

"మీకు కొడుకున్నాడు కదా..."

"ఇప్పుడు నడుస్తున్నది కొడుకుల రాజ్యం కాదు... కూతుళ్ళ రాజ్యం..."

"అసలేమయ్యింది బాబాయి?"

"యేం చెప్పమంటావురా మాధవ్... కడుపు చించుకుంటే కాళ్ళమీద పడ్తుందంటారు చూడు, మా పరిస్థితి అలా అయిపోయింది... మేం మా అబ్బాయి రమ్మని టికెట్స్ పంపిస్తేనే వెళ్ళాం... "యే ఫ్లైట్‌లో బుక్ చెయ్యమంటారు డాడీ!" అని వాడడిగాడు... యేదైనా ఫరవాలేదన్నాను... మా కోడలేమో "ఎయిరిండియాలో రండి మామగారు" అంది. "అది మనవాళ్ళది కదా! వేరే యిర్‌లైన్స్‌లో ఎందుకు?" అని కూడా అంది. అలాగేనమ్మా అన్నాను... ఎయిరిండియా ఫ్లైట్‌లోనే వెళ్ళాం...

అంతకుముందే పాస్‌పోర్టు, వీసా తీసుకొని ఉన్నాం కాబట్టి సులభంగానే వెళ్ళాం... ఆరునెల్లు ఉందామనే వెళ్ళాం... కానీ రెండునెల్లు కూడా ఉండలేకపోయాం"

"ఎందుకుండలేకపోయారు? మీరు వెళ్ళినప్పుడక్కడ చలికాలమా? అక్కడ చలికాలం భయంకరంగా ఉంటుందట కదా..."

"చలికాలం కాదు... మేం జూలైలో వెళ్ళాం... మధుసూదనం వాళ్ళు జూన్‌లో ఇక్కడకొచ్చారు. మేం జూలైలో వెళ్ళాం... జూలై, ఆగస్టు నెలల్లో అక్కడ వాతావరణం చాలా బావుంటుంది. మేం బోస్టన్ ఎయిర్‌పోర్టులో దిగగానే మా సుజిత్, అనిత – ఇద్దరూ వచ్చారు మమ్మల్ని రిసీవ్ చేసుకోవటానికి. కార్లో ఇంటికెళ్తోంటే మా కోడలు మా కొడుకుతో ఒక్కమాట కూడా మాట్లాడనీయకుండా ఆమే వాడితో యేదేదో... ఇంట్లో ఇదిలేదు... అదిలేదు... అవన్నీ ఎప్పుడు తెస్తావు... నువ్వసలు ఇంటిని పట్టించుకోనే పట్టించుకోవు... నీకెప్పుడూ ఆఫీసుగొడవే అంటూ పోట్లాడుతున్నట్టుగా మాట్లాడింది. "ప్రయాణం ఎలా జరిగింది డాడీ!" అని వాడు మాతో మాట్లాడబోతే "ప్రయాణం బాగానే జరుగుతుంది... అది మీరు అడగాల్సిన అవసరం లేదు... నేను చెప్పేది వినిపించుకోండి... ఈ కారును మార్చండి అని ఎప్పట్నించో మొత్తుకుంటున్నాను... అయినా మీరీ డొక్కు కారుతోటే నెట్టుకొస్తున్నారు... అంటూ వాడితో వాదనకు దిగింది... ఈ డొక్కు కార్లో ఎక్కడకు వెళ్ళినా సమస్యే... ఇప్పుడు మీ డాడీ మమ్మీలను కూడా రప్పించారు... ఈ డొక్కుకార్లో వాళ్ళనెక్కడికి తీసికెళ్ళాలన్నా సమస్యే... అంది. "నీ కారు బాగానే ఉందిగా... వాళ్ళను దాంట్లో తీసికెళ్దాంలే అని వాడంటే మీరేమన్న అనుకోండి... నా కారు నాకే కావాలి... రోజూ నేను రోహిత్‌ను... రోహిత్ మా మనవడు... స్కూలుకు తీసికెళ్లాలి... తీసుకురావాలి... నా కారు నా పొజెషన్‌లో లేకుండా నాకొక్కక్షణం కూడా గడవదు... మీ కారునే రిపేర్ చేయించుకొని వాళ్ళను తీసికెళ్ళండి... లేదా కనీసం వాళ్ళకోసమైనా కొత్తకారు కొనండి" అంది మా కోడలు.

కారు దిగి వాళ్ళింట్లో అడుగుపెట్టినప్పట్నించి మా బాధలు ఇంకా ఎక్కువయ్యాయి. మా కోడలుగారు మాతో చాలా ముభావంగా ఉండటం... అనుక్షణం మా సుజిత్‌తో యేదో వాదన పెట్టుకోవడం... మమ్మల్ని ఇంట్లో దించేయగానే... ఆరోజు శనివారం... వాడికి సెలవు... ఎవరింట్లోనో బర్త్‌డేపార్టీ ఉందని వెళ్దామని వాడిని పురమాయించింది. వాళ్ళిప్పుడే వచ్చారు కదా... ఆ ప్రోగ్రాం కాన్సెల్ చేద్దాం అని మావాడంటే వాడిమీద గయ్యిమని లేచింది. కాన్సెల్ చేస్తారా? వాళ్ళేమను

కుంటారు... మనింట్లో యే ఫంక్షన్ జరిగినా వాళ్ళొచ్చారు... వాళ్ళిప్పుడేవస్తే యేం... అన్నీ రెడీగా పెట్టాను... స్నానం చేసి భోజనం చేసి రెస్ట్ తీసుకుంటారు... ఆలోగా మనం వచ్చేస్తాం కదా అంది. అంతే! మావాడు ఆమెతో వాదన పెట్టుకోవద్దనుకున్నాడో యేమో... వెంటనే ఆమెనూ, రోహిత్‌నూ తీసుకొని ఆ పార్టీకి వెళ్ళిపోయాడు. బయట్నించి ఇంటికి తాళం వేసికొని వెళ్ళారు. ఆ లంకంత ఇంట్లో ఎక్కడేమున్నాయో తెలుసుకోవడానికే మాకు చాలా టైమ్ పట్టింది. ఆకలి దంచేస్తున్నా తినడానికేం కనిపించలేదు. అన్నీ తయారుగా ఉన్నాయని మా కోడలుగారు చెప్పింది. స్నానం చేశాక ఫ్రిజ్ ఓపెన్ చేసి చూశాం... యేవో ఉన్నయిగానీ మేం తినగల్గే పదార్థాలేవీ వాటిల్లో కనిపించలేదు. గంటలో వస్తామని వెళ్ళినవాళ్ళు మూడు గంటల తర్వాతొచ్చారు. బయట్నించి తాళాలు వేసుకొని వెళ్ళారు కాబట్టి వాళ్ళు ఇంట్లోకొచ్చినట్టే మాకు తెలియలేదు. వాళ్ళొచ్చేటప్పటికి మేం చెరో సోఫాలో పడుకొని నిద్రపోయాం... ఫ్లైట్‌లో మాకస్సలు నిద్రపట్టలేదు.

మా సుజితొచ్చి "మమ్మీ! డాడీ! అప్పుడే నిద్రపోయారా? స్నానం చేశారా? అసలేమన్న తిన్నారా? లేదా?" అన్నాడు.

"స్నానం చేశాం గానీ యేమీ తిన్లేదు... ఫ్లైట్‌లో అస్సలు నిద్రపట్టలేదు. వేడినీళ్ళతో స్నానం చేసేటప్పటికి నిద్ర ముంచుకొచ్చింది" అన్నాన్నేను.

"అయితే మీరేమీ తిన్లేదా?" అన్నాడు సుజిత్.

"లేదురా?" అన్నాను.

"తినడానికెక్కడేముందో మాకు తెలిస్తేకదా?" అంది మీ పిన్ని.

"ఫ్రిజ్‌లో అన్నీ ఉన్నాయి. ఒక్కసారి ఫ్రిజ్ ఓపెన్‌చేసి చూస్తే అన్నీ కనిపించేవి" అంది మా కోడలు నిష్ఠూరంగా.

"మీ ఫ్రిజులు ఎలా ఓపెన్ చెయ్యాలో మాకు తెలియదు కదా!" అంది మీ పిన్ని.

"మీ ఫ్రిజులు మా ఫ్రిజులు అని యేమీ ఉండవు. అక్కడి ఫ్రిజులున్నట్టే ఇక్కడి ఫ్రిజులుంటాయి. మీరు ఫ్రిజుల్నెప్పుడూ చూడనట్టే మాట్లాడుతున్నారే! అంతదూరం నుండి మీరొస్తే మీకు కనీసం భోజనం కూడా పెట్టలేదని నన్నాడిపోసుకోవడానికా ఇదంతా" అంది మా కోడలు ఇంకా నిష్ఠూరంగా.

"అనితా! యేమిటా మాటలు... వాళ్ళొచ్చారోలేదో నిష్ఠూరాలు మొదలెట్టావా?" అనబోయాడు సుజిత్.

"మీకెందుకంత కోపమొస్తోంది... ఇప్పుడు నేనేమన్నానని... నేనేం మొదలెట్టాను... మొదలెట్టింది వాళ్ళా? నేనా? ఫ్రిజ్‌లో అన్నీ అరేంజ్ చేసే వెళ్ళాను కదా... వాటిని డైనింగ్ టేబుల్ మీదకు తెచ్చుకొని హాయిగా తిని పడుకోవచ్చుకదా!" అంది మా కోడలు.

"ఫ్రిజ్‌లో యేమేం ఉన్నాయో... ఎలా ఓపెన్ చెయ్యాలో వాళ్ళకు మనం చూపించామా?" అన్నాడు సుజిత్.

"వెళ్ళే హడావుడిలో ఉండి నేను చూపించలేదే అనుకొండి... మీరు చూపించొచ్చుగా" అంటూనే ఆమె విసురుగా మా మనవడ్ని తీసుకొని వాళ్ళ బెడ్‌రూంలోకెళ్ళిపోయింది.

"ఓ.కే. ఓ.కే... మీరు ఫీలవ్వద్దు రండమ్మా... నాన్నా మీరుకూడా రండి" అంటూ మావాడే ఫ్రిజ్ ఓపెన్ చేసి లోపలున్న పదార్థాలనన్నింటినీ డైనింగ్ టేబుల్ మీదకు చేర్చి మేం తినగల్గేవాటిని వేరుచేసి వాడే మాకు వాటిని వడ్డించాడు.

చప్పగా చల్లారిపోయిన ఆ అన్నంకూరలతో భోజనం అయిందనిపించాం.

వెళ్ళిన మొదటిరోజలా గడిచిందా... ఒక్కమాటలో చెప్పాలంటే ప్రతిరోజూ అలాగే గడిచిందిరా మాధవ్...

రోజూ ఆవిడగారు మావాడితో యేదో వాదన పెట్టుకోవడం... వాడు కోపంతో ఆఫీసుకు వెళ్ళిపోవడం... వాడెప్పుడైనా మాకు ఎలాట్ చేసిన రూంలోకొచ్చి మాతో మాట్లాడుతున్నాడనుకో... వాడొచ్చిన మరుక్షణంలోనే "సుజిత్! రోహిత్ అల్లరి చేస్తున్నాడు. వాడు నీకే కంట్రోలవుతాడు... నేను చెబితే వినడు... ఓసారి వీడిదగ్గరకొచ్చెయ్... అంటూ పిలిచేది... రోహిత్‌ను మేం తీసుకోబోయినా, వాడు మా దగ్గరికి రాబోయినా వెంటనే "వాడి హెల్త్ బాగలేదత్తయ్యా! వాడికిప్పుడు కాఫ్ సిరప్ తాగించాలనో, వాడిప్పుడు టీ.వీలో కార్టూన్‌నెట్‌వర్క్ చూస్తున్నాడనో. టీ.వీ. చూసేటప్పుడు వాడిని డిస్టర్బ్ చెయ్యొద్దనో... ఇలా యేదో చెప్పి వాడిని మా దగ్గరకు రానీయకుండా చేస్తుండేది. మేమున్న ఆ రెండు నెలల్లో వాడొక్కసారి కూడా "తాతయ్యా!" అనో "నానమ్మా!" అనో మా దగ్గరకు రాకుండా మా కోడలు గారు చాలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది. వాడు మాదగ్గరకొస్తే వాడికి మా ద్వారా యేదన్నా ఇన్‌ఫెక్షన్ అవుతుందని కూడా ఆమె అనుకుంటోందని మాకర్థమైంది.

మావాడు సాటర్‌డే, సండే వచ్చినప్పుడు మమ్మల్నెక్కడికైనా బయటకు తీసికెళ్తానంటే మా కోడలుగారు "రేపు మనం మన ఇంటిని క్లీన్ చేసుకోవాలి...

ఎలా వీలౌతుంది... వచ్చే సండే వెళ్దాంలెండి" అనేది. అంతే! మావాడు కాస్సేపు ఆమెతో వాదన పెట్టుకున్నట్టే పెట్టుకొని ఆమె చెప్పినట్టే వినేవాడు.

మెల్లగా మా కోడలుగారు "అత్తయ్యా! అత్తయ్యా!" అని పిలిచి కొన్ని ఇంటిపనులు చెప్పడం మొదలెట్టింది. వాక్యూమ్ క్లీనర్‌తో ఎలా ఇంటిని శుభ్రం చెయ్యాలో చెప్పి ఆ పని చెయ్యమనేది. లేకపోతే ఫలానా వంట మీరు బాగా చేస్తారు కదా... ఈరోజు చెయ్యండని చెప్పేది... మామయ్యగార్కి కాఫీ మీరే చేసివ్వండి. మీరు చేస్తేనే మామయ్యగార్కి బావుంటుంది... మీ అబ్బాయికి కూడా మీరు చేసే వంటలంటే చాలా ఇష్టం.... అంటూ వంటపనులన్నీ మీ పిన్ని చేతనే చేయించటం మొదలెట్టింది.

వాడోరోజు "సండే మిమ్మల్నెక్కడికన్నా తీసికెడదామంటే వీలవటం లేదు... ఓ నాల్గురోజులు లీవ్ పెడ్తాను డాడీ... మీకు బోస్టన్‌లో ఉన్న కొన్ని మంచి ప్లేసెస్ చూపిస్తాను... తర్వాత మనం న్యూయార్క్ వెళ్దాం... నయాగరాకు కూడా వెళ్దాం" అంటూ చెప్పగానే మా కోడలు "లీవ్ పెడ్తారా... మీకు లీవులెక్కడున్నాయి... మీరిలా లీవులు పెట్టడం మొదలెడ్తే మీ ఉద్యోగం ఊడుతుంది. మేం వీధుల్లో పడాల్సి వస్తుంది. ఓ టూరిస్టు బస్సు ఎక్కించండి. వాళ్ళే అన్నీ చూపించి తీసికొస్తారు" అంది.

"లేదు... వాళ్ళను నేనే తీసికెళ్తాను... మీ అమ్మ, నాన్నలొచ్చినప్పుడు నాతో ఎన్నిరోజులు లీవులు పెట్టించావో మరచిపోయావా? మీవాళ్ళకొక రూలు? మావాళ్ళకొక రూలా?" అన్నాడు సుజిత్, కొంచెం కోపంగా.

అంతే... ఆమె ఆగ్రహోదగ్రురాలైంది. దగ్గర్లోఉన్న వస్తువుల నన్నింటిని నేలకేసికొట్టింది... "మావాళ్ళకోసం నేను నిన్ను లీవులు పెట్టమన్నానా? అప్పుడన్నీ సెలవులే వచ్చాయి. నువ్వు నామీద ఇంత నిందవేశాక నేనింకా బతికే ఉంటాననుకుంటున్నావా... ఇప్పుడే ఉరేసుకొని చస్తా" అంటూ బెడ్‌రూంలోకి పరిగెత్తింది. మావాడెళ్ళి ఆమెను ఓ గంటసేపు బతిమాలాడు. మేంకూడా వెళ్ళి మాకోసం లీవ్‌పెట్టొద్దు. మేం ఎక్కడికి వెళ్ళడం లేదు... మాకు ఇంట్లోనే హాయిగా ఉంది. బయటకెళ్ళి తిరిగే శక్తికూడా మాకు లేదు... మేమొచ్చి మీ ఇద్దరి మధ్య కలతలు పెట్టినట్టయింది.... మీరిద్దరు బాగా ఉంటే మాకదే చాలునని మా కోడలుగార్ని బతిమిలాడాం.

అంతే – అప్పట్నించి మావాడు మా కోడలుతో వాదించటం మానేశాడు. ఆమె చెప్పినట్టే వినడం మొదలెట్టాడు. మా దగ్గరికి రాగానే ఆమె వాడిని "సుజిత్...

సుజిత్... ఒకసారిటురా... ఈ రూంలో ఏసీ పనిచెయ్యడం లేదు. కంప్యూటర్ ఓపెన్ చేసి ఇంటర్నెట్‌లో మా ఫ్రెండ్‌తో కాస్సేపు ఛాటింగ్ చేద్దామంటే కనెక్ట్ కావడం లేదు అంటూ పిలిచేది. ఆమె అలా పిలవగానే మావాడు ఆమె దగ్గరకు పరిగెత్తేవాడు.

ఒకసారి వాళ్ళు బయటకు వెళ్తున్నప్పుడు మా కోడలుగారు "అత్తయ్యా! మేమొచ్చేటప్పటికి ఈ ఛికెన్ వండేసెయ్యండి" అంది చికెన్ పీసెస్‌ని మీ పిన్నికిస్తూ.

"నాకు చాలా తలనొప్పిగా ఉందమ్మా... నువ్వొచ్చాకే వండుకో" అంది మీ పిన్ని.

"దయచేసి నువ్వు మా అమ్మకు పనిచెప్పడం మానేస్తావా? కావాలంటే నాకు చెప్పు... ఆ ఛికెన్ నేనొండుతాను" అన్నాడు సుజిత్.

"సారీ సుజిత్ గారూ! సారీ, తప్పయింది. క్షమించండి..." అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకొని బెడ్‌రూంలోకెళ్ళిపోయింది.

"మేమొచ్చి మీమధ్య కలతలు పెట్టినట్టవుతోంది. మా రిటర్న్ టికెట్స్ డేట్ మార్పించుకురారా సుజిత్... మేం ఈ రెండుమూడు రోజుల్లోనే వెళ్ళిపోతాం" అంది మీ పిన్ని మా సుజిత్‌తో.

"వెళ్ళిపొండి... అప్పుడు మిమ్మల్ని నేనే వెళ్ళగొట్టానని మీ అబ్బాయిగారు నన్నింకా రాచి రంపాన పెడ్తాడు... అసలు మీరొచ్చిందే నన్ను యేడిపించటానికి..." అంది బెడ్‌రూంలోంచి విసురుగా వచ్చిన మా కోడలు.

ఆరోజు రాత్రే మీ పిన్ని, నేనూ దృఢంగా నిశ్చయించుకున్నాం... వెంటనే మనదేశానికి వెళ్ళిపోవాలని...

మా కోడలుగారు స్నానం చెయ్యడానికి బాత్‌రూంకు వెళ్ళినప్పుడు మా వాడికి చెప్పేశాం... రిటర్న్ టికెట్స్ డేట్స్ మార్పించుకు రమ్మని... వాడుకూడా మా పరిస్థితిని అర్థం చేసుకున్నాడు.

"దాంతో చాలా ప్రమాదం అమ్మా... గట్టిగా యేమన్న అంటే "నా భర్త, మా అత్తమామలు నన్ను ఇంట్లో హింసిస్తున్నార"ని ఇక్కడి పోలీసులకు కంప్లెయింటిచ్చేటట్టుంది.

అలాంటిదేమన్న జరిగితే వెంటనే పోలీసులొచ్చి నన్ను, మిమ్మల్ని అరెస్టు చేసి జైల్లో పెడ్తారు. మిమ్మల్నిక్కడ్నుంచి సాధ్యమైనంత త్వరగా పంపించెయ్యడమే మంచిదనిపిస్తోంది" అని చెప్పి వాడు ఆఫీసుకు వెళ్ళిపోయాడు.

వాడు చెప్పిన ఆ మాట విన్నాక మాకక్కడ ఇక ఒక్కక్షణం కూడా ఉండాలనిపించలేదు. నిప్పులకుంపటిమీద కూర్చున్నట్టుగా ఫీలయ్యాం. మా కోడలు

మాతో మాట్లాడటం పూర్తిగా మానేసింది. శత్రువులను చూసినట్టు చూడటం మొదలెట్టింది. మా మనవడికి కూడా మేం వాడి శత్రువులం అన్న అభిప్రాయాల్ని కల్గించింది.

మావాడు త్వరగానే మా రిటర్న్ టికెట్స్ డేట్స్ మార్పించుకొచ్చాడు. మేం వెళ్ళాల్సినరోజు మమ్మల్ని ఎయిర్‌పోర్టులో దింపడానికి మావాడు వస్తోంటే "నేనూ వస్తానని, అత్తామామలు వెళ్ళిపోతున్నప్పుడు ఎయిర్‌పోర్టు దాకా వచ్చి బై చెప్పకపోతే లోకం తనను తప్పుపట్టదా" అంటూ మా కోడలొచ్చి కార్లో మావాడి పక్కన కూర్చుండిపోయింది. కనీసం ఎయిర్‌పోర్టుకు మమ్మల్ని తీసుకెళ్తున్నప్పుడన్న మావాడితో కాస్సేపు మా వ్యథ, కథ చెప్పుకుందామనుకుంటే మా కోడలుగారు మాకు ఆ అవకాశం కూడా ఇవ్వలేదు. ఎయిర్‌పోర్టు చేరేంతవరకు మా కోడలుగారు మావాడితో యేదేదో అక్కడి వాళ్ళ ఫ్రెండ్స్ గురించి, ఇండియాలో జరుగుతున్న రాజకీయ పరిణామాల్ని గూర్చి, ఇండియాలో ఉన్న వాళ్ళ బంధువుల్ని గూర్చి మాట్లాడింది. మమ్మల్ని వాడితో ఒక్కమాట కూడా మాట్లాడనీయలేదు. వాడుకూడా ఆమెతోటే మాట్లాడాడు తప్ప మాతో ఒక్కమాట కూడా మాట్లాడే ప్రయత్నం చెయ్యలేదు.

మేం లగ్గేజి బుక్ చేయించి, బోర్డింగ్ ప్యాస్ తీసుకొని సెక్యూరిటి చెక్ దగ్గరకు వెళ్తున్నప్పుడు మా కోడలు గారు మాకు బై చెప్పడమే కాదు, మా మనవడితో కూడా బై చెప్పించింది. మేం కూడా బై చెప్పి మా ప్లేన్ ఆగే గేటువైపు వెళ్తున్నప్పుడు మా కన్నుల్లోకి ఉబికివస్తున్న కన్నీళ్ళను ఆపుకోలేకపోయాం. మా సుజిత్తైతే మాకేసి చూడనూలేదు... బై చెప్పనూ లేదు. ఆ క్షణంలో వాడి మనస్సులో ఎలాంటి సంఘర్షణ జరుగుతున్నదో నేను ఊహించుకోగల్గాను... గేటు దగ్గరకు వెళ్ళి అక్కడి లాంజ్‌లో కూర్చున్నాక మీ పిన్ని బోరుమని యేడ్చేసింది. అలా ముగిసిందిరా మాధవ్, మా అమెరికా యాత్ర" పురుషోత్తమరావు చెప్పడం ముగించాడు.

✧✧✧✧✧

– 'నవ్య' (వీక్లీ)